

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక
(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 13 జనవరి, 2017 సంచిక : 8

సంస్థాపకులు :
శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు
సంస్థాపక సంపాదకత్వం :
శ్రీ మాతా శుకవాణి
ప్రధాన సంపాదకత్వం :
బ్రహ్మచారి శ్రీ సాయి రామచైతన్య M.A
ప్రచార సారధ్యం
శ్రీ ఎం. సత్యనారాయణ M.Tech
ప్రత్యేక సహకారం
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
డా॥ జి.చంద్రారెడ్డి M.A, Ph.D

సాయివాణి చందా వివరాలు
ద్వైవార్షిక చందా. ......... రూ॥ 160/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥ 800/-

చిరునామా :-
సాయివాణి
C/o శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు
సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565
E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

విషయసూచిక పుట సంఖ్య

మా వాణి ........ 2
మన పనులకు మనమే ........ 4
ఆనంద నిలయం ........ 5
షిరిడీ డైరీ ........ 7
సాకోరీ మహర్షి ........ 10
భక్త కథాసుధ ........ 13
గజానన విజయం ........ 17
సంస్మరణం ........ 20
మాతృసంస్థ కబుర్లు ........ 23
ఆశీర్వదించండి ........ 28
ప్రశాంతి ........ 29
అమ్మ దర్శనం ........ 30
మన జెండా ........ 32







## మా వాణి




### స్వీయ కథ

సాయిబంధువులందరికీ వినమ్ర నమస్కారాలు,

ఈవేళ మీ ప్రేమాశీస్సులను కోరి మీముందు వినయంతో దోయిలించి నిలుస్తున్నాను. నాకీ నెలతో-ఈ సంచికతో ఇరవై ఏడేళ్లు నిండాయి. నావంటి ఆధ్యాత్మిక పత్రిక నడవాలంటే ఎంత కష్టంగా ఉంటుందో మీరందరూ ఎరుగనిది కాదు. లోకంలో సాధారణంగా కథలు, నవలలు, సరదా కబుర్లు, నాటకాలు, జోకులు వీటన్నిటి మీదా ఉండే ఆసక్తి ఆధ్యాత్మిక విషయాల మీద ఉండదనేది అందరికీ తెలుసు. అందునా-నేను ఏ కాస్త తేలిక విషయాలనుగానీ, అల్పమైన హాస్యాన్నిగానీ, అభూత కల్పనలనుగానీ చెప్పడానికి నా సృష్టికర్త అయిన గురుదేవులు ఒప్పుకోబోరు కూడా. కన్నతల్లి బిడ్డ క్షేమాన్ని కోరి చేదు మాత్రలిచ్చినట్లే - యిలాటి పత్రికలు కూడా ప్రజా క్షేమాన్ని కోరి సత్యాలను నిర్భయంగా, నిర్ద్వంద్వంగా చెప్పాలనీ, హుందాగా ఉండాలనీ వారి ఆదేశం. అందుచేత నేను పుట్టిననాటి నుంచీ కూడా బాల్య చాపల్యాలు లేకుండా కాస్త పెద్దమనిషి తరహాగా పెరగవలసి వస్తోంది. ఈ మధ్యకాలంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాను నా తండ్రి, నా గురుదేవులు, నా సృష్టికర్త సాయినాథులలో ఐక్యమైనారు. ఆ బాధ నుండి మరచిపోయేలోపే, తన వాణి నా వాణిగా పలికించే నా ప్రధాన సంపాదకురాలు 'శుకవాణి' అమ్మ గురుసన్నిధికి చేరిపోయారు. నేను పుట్టినప్పటినుండి నన్ను పెంచి, సమాజంలో నాకంటూ ఒక ఉనికిని ఏర్పాటు చేసి అహరహమూ నా కోసం శ్రమించి, తపించిన 'మా వాణి' లేకపోవటం భరించనలవి కావటం లేదు.

అయినా సరే - నాకు శ్రీ సాయినాథుల ఆశీస్సులున్నాయి. మా

గురుదేవుల రక్షా వీక్షణం నాపై ఉంది. ఎందరో మహనీయులు, మాతాజీల చల్లని దీవెనలున్నాయి. అందుచేతనే నా నడక ఎక్కడ తడబడటం లేదు. నన్ను ప్రతినెలా తమ ఇండ్లకు ఆహ్వానించే సాయిభక్తులు నేను చెప్పే ప్రతి పలుకూ ఎంతో శ్రద్ధగా ఆలకిస్తారు. వాటిని గూర్చి యితర సాయీ భక్తులకు చెప్తారు. నేను చేతికి రాగానే మన ఆశ్రమంలో ఏం జరిగింది అని మాతృసంస్థ కబుర్లు చదివేవారు ఎంతమందో! నాలోని ఒక్కొక్క విషయం చదివి దానిలోని సారాంశాన్ని హృదయానికి పట్టించుకుంటారు. దాని వలన ఎంతో మేలు పొందుతున్నామని నాకు-అంటే నన్ను పెంచి పోషిస్తున్న వారికి ఉత్తరాలు వ్రాస్తుంటారు. నన్నభిమానించే వారెందరో నన్ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలనీ తపనతో నాకెన్నో ఆభరణాలు చేసి పంపిస్తుంటారు. తమ రచనలు పంపే అనేకానేకులైన సాయీభక్తులూ ఇంకెన్నో యితర రచనలు, వ్యాసాలు పంపే పెద్దలూ-వీరందరికీ నా కృతజ్ఞతలు. నేను ఇంత సర్వాంగ సుందరంగా తయారుచేసి పంపుతున్న మా గురుదేవుల అభిమానులు, మాన్యులు శ్రీ వి.వి.కృష్ణారావుగారు, శ్రీమతి మాలతీగార్లకు, ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ సప్తవిశంతి (27వ) జన్మదినాన సాయీ భక్తులందరికీ నాదో చిన్న విన్నపం. నన్ను ఒక్క ఏడాదిపాటు ఇంటికి రప్పించుకోదలచిన చందాలు కట్టిన వారందరూ ఆజీవ సభ్యత్వంగా (రూ.800) మార్చండి. మీకు తెలిసిన మరొక్క సాయీభక్తుడిచేత - కనీసం ఒక్కరిచేతనైనా చందా కట్టించండి. అప్పుడు నేను చెంగు చెంగున ఎగురుతూ, హాయిగా పరుగులు పెడుతూ ఎదిగేందుకు అవకాశం లభిస్తుంది. నేను మీకు జ్ఞానపుష్టి కలిగిస్తున్నాను. మీరు నాకు ఆర్థిక పరిపుష్టి కలిగించండి. నా పలుకులు ఇంకా యింకా మధురం కావటానికి ఏమైనా సలహాలుంటే వ్రాయండి. నాకు మనఃపూర్వకంగా జన్మదిన శుభాకాంక్షలు చెప్పండి.

**సెలవు**

**మీ**

**సచ్చిదానంద సద్గురు సాయివాణి**





# మన పనులకు మనమే బాధ్యులము

## రామకృష్ణ పరమహంస చెప్పిన గూఢార్థ కథల నుండి

ఒక బ్రాహ్మణుడు ఒక తోటను పెంచి, రాత్రింబవళ్ళు దానిని జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉంటున్నాడు. ఒకరోజు ఒక ఆవు ఆ తోటలో ప్రవేశించి, వాడెంతో ప్రీతితో పోషిస్తూ వచ్చిన ఒక మామిడి అంటును తినివేసింది. తనకెంతో ప్రియమైన ఆ మొక్కను ఆవు మేయడం చూసి, బ్రాహ్మణుడు కాలరుద్రుడై ఒక బడితె తీసుకొని ఆవును బాదసాగాడు. ఆ దెబ్బలకు తాళలేక ఆవు చనిపోయింది. బ్రాహ్మణుడు గోహత్య చేశాడనే వార్త అన్నివైపులా వ్యాపించింది. ఆ బ్రాహ్మణుడు తాను వేదాంతినని చెప్పకునే వాడు. గోహత్యాపాతకం తనకు చుట్టుకున్నదని ఎవరైనా అంటే చాలు, అతడు యిలా చెప్పేవాడు "లేదు నేను గోహత్య చెయ్యలేదు, ఆ పనిచేసింది నా చెయ్యి. చేతికి అధిష్ఠాన దేవత ఇంద్రుడు. కాబట్టి ఆ గోహత్యాపాతకం ఇంద్రునిదేగాని నాది కాదు!"

స్వర్గంలో ఇంద్రుడు యీ మాటలు విన్నాడు. ఆయన ఒక వృద్ధ బ్రాహ్మణ వేషంలో తోటలో ఉన్న యీ బ్రాహ్మణుడి దగ్గరకు వచ్చి యిలా ప్రశ్నించాడు.

ఇంద్రుడు : "అయ్యా! ఈ తోట ఎవరిదండీ?"

బ్రాహ్మణుడు : "నాది"

ఇంద్రుడు : "ఇది ఎంత చక్కని తోట! చాలా నేర్పుగల తోటమాలి మీకు దొరికి ఉంటాడు. చూడండి! మొక్కలను ఎంత సొగసుగా, ఎంత నైపుణ్యంతో నాటాడో!"

బ్రాహ్మణుడు : "ఇదంతా నాపనేనండీ! చెట్లన్నింటినీ నేనే స్వయంగా పరీక్షించి, స్థలం కూడా నేనే నిర్ణయం చేసి, నేనే పాతించానండీ".

ఇంద్రుడు : "అలాగా! చాలా చక్కగా పాతించావే! ఇక్కడ ఈ త్రోవ

ఎవరు వేయించారండీ? దీనిని కూడా చాలా అందంగా నిర్మించారే!"

బ్రాహ్మణుడు : "అంతా స్వయంగా నేను చేసినదేనండీ!"

ఇంద్రుడు : "అప్పడు అతణ్ణి ఘాటుగా విమర్శిస్తూ, "ఈ పనులన్నీ నావేననీ, ఈ తోట ఘనత అంతా నాదేననీ చెప్పకుంటు న్నావు గదా! కాని ఆవును చంపిన పాపం మాత్రం ఇంద్రుడికి అంటగట్టడం చాలా అన్యాయం సుమా!" అని పలికాడు.

మనుష్యులు గొప్పవిగా కనిపించే వాటిని తమ ప్రజ్ఞగా చెప్పకుంటారు గానీ తాము చేసే పొరపాట్లకూ, పాపాలకూ కారణాలనూ, బాధ్యతనూ ఇతరుల మీదకో, అది కుదరకపోతే దైవం మీదకో నెడతారు. అలా చెయ్య కూడదు. మనం చేసే పనులకు బాధ్యత మనదే. మనకు అనుకూలంగా వేదాంత శాస్త్రాలకు చెప్పడం ద్వారా ప్రజల్ని మోసగించకూడదు.

అంతేకాక, ఒక ఉన్నతాదర్శానికి తగినట్టు జీవించడంలో విఫలమయి నపుడు మనచేతగానితనాన్ని అంగీకరించడమే మేలు. అలాకాక ఆ ఆదర్శాన్ని క్రిందికి లాగడానికి ప్రయత్నించడం అత్యంత నికృష్టం. అలా చేయడం వల్ల మనల్ని మనమే మోసగించుకున్నవారమౌతాము కూడా.



# ఆనంద నిలయం

– ముప్పాళ్ళ దశ్వంతరావు

1. "వక్త్రం మధురం వదనం మధురం
అధరం మధురం నయనం మధురం"
వచనం మధురం వాక్కే మధురం
సత్యపదానందుని సన్నిధే మధురం ।





2. సద్గురు చరణం సాయీధామం
షిరిడీశ్వరం సదానందప్రదం
ఆదిగురుస్థానం దత్తాత్రేయం
సత్యపదానందం సదా నమామి ।

3. నిత్యాన్నపూర్ణం నిరతాన్నదానం
ధర్మజ్యోతం ధార్మిక ప్రబోధం
విద్యాధామం ప్రబోధ నిలయం
నిత్యదర్శనం శ్రీ సత్య పదానందం ।

4. అనాథ బాలల గురుకుల క్షేత్రం
సంధ్యావందనం వానప్రస్థం
యోగ సాధనం సత్సంగ ధామం
షిరిడీశ్వరం సత్యపదానందం ।

5. ఫాలభాగం త్రిపుండ్ర తేజం
అమృత నయనం దివ్యప్రకాశం
కాషాయ వస్త్రం రుద్రాక్ష మాలం
వైరాగ్య రూపం శ్రీ సత్య పదానందం ।

6. ఆనంద నిలయం వాణీ ప్రసన్నం
అమృతమూర్తిం అమ్మ ప్రసాదం
అదృష్టజాతం ఆత్మస్వరూపం
సత్యపదానందం కరుణార్ద్ర హృదయం ।

7. నమామి నమామి సాయీశ నమామి
నమామి నమామి క్షేత్రేశ నమామి
నమామి నమామి మాతృశ్రీ నమామి
నమామి నమామి సత్యపదానంద నమామి ॥



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

లక్ష్మీబాయి చిన్ననాటి జీవితం గురించిన వివరాలేవీ కపర్దే జీవితచరిత్రలో లేవు. మనకు ఆమె కపర్దే భార్యగా, పిల్లల తల్లిగా, ఇల్లు దిద్దే గృహిణిగా మాత్రమే కన్పిస్తుంది. లక్ష్మీబాయి చదవగలదే గానీ వ్రాయలేదు. అంటే ఆమె విద్యా హీనురాలని కాదు. నిజానికామె గొప్ప సంస్కారం గల స్త్రీ. కీర్తనకారుల ద్వారా వినీ, స్వయంగా చదివీ రామాయణ, మహాభారతగాథలు, పాండవ ప్రతాపం, శివలీలా మృతం మొదలైనవన్నీ నేర్చుకున్నది.

దాదాసాహెబ్ కపర్దే ఇల్లు బాగా పెద్దది. ఒక్కొక్కప్పుడు దానిలో పిల్లలు కాక మొత్తం మీద ఏభై మంది ఉండేవారు. దాదాసాహెబ్, అతని భార్య, ముగ్గురు కొడుకులు, వాళ్ల భార్యలు, తాము ఆశ్రయమిచ్చిన మూడు కుటుంబాలు, పన్నెండు, పదిహేను మంది విద్యార్థులు, ఇద్దరు వంటవాళ్లు, వాళ్ల భార్యలు, ఇద్దరు గుమాస్తాలు, ఒక కాపలావాడు, ఎనిమిది మంది గుర్రాల శాలలో పనిచేసేవారు, ఎడ్లబళ్లు తోలేవారిద్దరు, ఒక గోపాలకుడు, ఇద్దరు పనిమనుషులు, సగటున కనీసం ముగ్గురు అతిథులు - ఇలాంటి ఇల్లు అధికారికంగా నడుపుతూ ఉండాలంటే లక్ష్మి బాయి సంచలించే కన్ను ప్రతిదాన్నీ శ్రద్ధతో చూస్తుండవలసిందే. ఆమె పెద్దలూ, చిన్నలూ అనే భేదం చూచేది కాదు. ఇంట్లోని పిల్లలందరికీ- తన పిల్లలతో సహా వండి వడ్డించేది. ఏ పిల్లవాడికి జబ్బు చేసినా స్వయంగా తానే సేవ చేసేది. ఒకసారి నీల్‌కారీ అనే విద్యార్థికి తొడ మీద సెగ్గడ్డ





లేచి, బాగా జ్వరం వచ్చి, ఆసుపత్రిలో పడ్డాడు. లక్ష్మీబాయి స్వయంగా హాస్పిటల్‌కు భోజనం తీసుకువెళ్లి తినిపించేది. అతని జబ్బు రెండు నెలలకు పైగా ఉంది. అతను లక్ష్మీబాయికి జీవితమంతా విశ్వాసంతో ఉన్నాడు. “ఆమె నాకోసం నా తల్లి కూడా చెయ్యలేనంత చేసింది. ఆమె కరుణ లేకపోతే నేను చచ్చిపోయి ఉండేవాడిని” అన్నాడు. ఇలాటి ఉదాహరణలెన్నో! ఆమె తాము ఆశ్రయమిచ్చిన బాలకృష్ణ నేనే అనే అతని భార్యకు తాను వ్యక్తిగతంగా సీమంతోత్సవం చేసింది. గర్భవతులుగా ఉన్న ఆడవాళ్లకు ఇష్టమైన తినుబండారాలు, మంచి చీరలతోపాటు మంచి బహుమతి కూడా యిచ్చింది. ఇందులో ఏదీ అసాధారణ మైనది లేదు. లక్ష్మీబాయి స్వభావమే అలా ఉంది. కపర్దే డైరీలో ఆగస్టు 8న సీమంతోత్సవం కారణంగా మధ్యాహ్నభోజనం ఆలస్యమైందని వ్రాసి ఉంది. ఇంటి మీద తన అధికారాన్ని చూపించవలసి వచ్చినపుడు - అతి తక్కువగా ఆమెకు కోపం వచ్చేది. అయినా ఆమెను చూచి భయపడేవారు. ఆమెకు ఎప్పుడైనా కోపం తెప్పించి నా యింట్లో ఎవ్వరికీ ఆమెను ఎదిరించే ధైర్యం లేదు.

లక్ష్మీబాయికి దేశీయమైన మందుల గురించిన జ్ఞానం కూడా ఉండేది. ముఖ్యంగా కామెర్ల వ్యాధికి తన అత్తగారి నుండి కుటుంబ సంప్రదాయంగా వచ్చిన ఖచ్చితమైన మందు తెలుసు లక్ష్మీబాయికి. ఆ మందు ఒక్కసారి వేస్తే చాలు కామెర్లు నయమయ్యేవి. ఈ సంగతి పరిసర గ్రామాలలో అందరికీ తెలుసు. ప్రతిరోజూ ముగ్గురు, నలుగురు మనుషులు వచ్చి ఉచితంగా మందు తీసుకొనేవారు. ఈ చికిత్స లక్ష్మీబాయి తన కోడలికి నేర్పింది.

లక్ష్మీబాయి వివాహం దాదాసాహెబ్‌తో ఆనాటి ఆచారాన్ని బట్టి చిన్న వయసులోనే జరిగి ఉండవచ్చు. ఆమె తండ్రి బ్రిటిష్ రాజ్యంలో ఒక మామ్లేదారు. పదవీ, ధనమూ రెండూ ఉన్నవాడు. తరువాత దాదాసాహెబ్ ప్లీడరై, ప్రాక్టీసు పెట్టి, అతి త్వరగా తనదైన ముద్రవేసి గొప్ప స్థాయికి వెళ్లాడు. కనుక లక్ష్మీబాయి

తన భర్త యింట్లో సమృద్ధిగా, అభివృద్ధికరంగా ఉన్న వాతావరణంలో మంచి జీవితాన్నే అనుభవించిందని చెప్పవచ్చు. పైగా ఆమె సహజంగానే దాతృత్వం గల మనిషి. అంచేత డబ్బు విస్తారంగా ఖర్చు చేసేది. అదెలాగో చూద్దాం.

ఇంట్లో వంట ఎప్పుడూ పెద్దఎత్తున జరిగేది. ఏభై మందికి వండినపుడు నలుగురైదుగురికి మిగిలిపోయేది. ఆమె పిల్లలు ఆనాటి ఫేషన్లకు అనుగుణంగా చక్కగా తయారయ్యేవారు. తన పిల్లలకెప్పుడూ నూలుబట్టలుగానీ, చినిగిన బట్టలుగానీ వేసేది కాదు. 9, 10 అంగుళాల సిల్కు అంచులున్న ధోవతులు, పైన సిల్కు చొక్కాలే వేసుకొనేవారు. కొత్త దుస్తులైనా సరే కొంచెం చినిగితే వెంటనే తీసివెయ్యటమే. పాలు కుండలలెక్కన కొనటమే. ఎక్కువెక్కువ పాలుండేవి. నెయ్యి పదార్థాలతో విడిగా వడ్డించటం లేనే లేదు. మూడు చిన్న గిన్నెల నిండా నెయ్యి ప్రతి భోజనం పక్కనా ఉండేది. ఈ పద్ధతి యింటి వారికే కాదు - అతి చిన్న పనివాడికి కూడా అదే పద్ధతి. మామూలుగా కూడా భోజనం ఒకే ఉత్తమమైన రీతిలో మిఠాయిలు, ఇంపైన వంటకాలతో నిండి ఉండేది.

ఇలాంటి సంపన్నమైన జీవితాన్ని గడిపినాక - దాదాసాహెబ్ సంపద తాత్కాలికంగా కొద్ది సంవత్సరాలపాటు (లోకమాన్య తిలక్ అరెస్టు సందర్భంగా) తగ్గిపోగానే ఆమె మారిన పరిస్థితులకు సర్దుకోలేకపోయింది. తరువాత సాయిలీలలో "షిరిడీ డైరీ గురించి మరికొంత" అన్న శీర్షికలో వ్రాసిన దానిలో మనం చదివాము. లోకమాన్య తిలక్‌పై రాజద్రోహ నేరానికి విచారణ జరిగి, ఆరేళ్ల జైలుశిక్ష విధించబడిందని. దాదాసాహెబ్ హఠాత్తుగా ఓ నిర్ణయానికి వచ్చాడు. తిలక్‌ను విడిపించడానికి ఇంగ్లండు వెళ్లాలని. ఆగస్టు 15న బయలుదేరి వెళ్లిపోయాడు. దాదాసాహెబ్ పెద్దకొడుకు బొంబాయి లా కాలేజ్‌లో 'లా' చదువుతున్నాడు. అతను దాదాసాహెబ్ హఠాత్తుగా యిలా వెళ్లటం గురించి తల్లికి సరైన సమయంలో సమాచారం యివ్వ లేకపోయాడు. అందుకు తల్లి అతన్ని నిందించింది - కాలం మారిపోయిందని. దాదాసాహెబ్ రెండేళ్లకు పైగా





ఇంగ్లండ్‌లో ఉన్నాడు. తిరిగి వచ్చాక కూడా బ్రిటిష్ వారి నిఘాలో ఉన్నాడు- యివేవీ ఆమె అర్థం చేసుకోలేకపోయింది. పై కారణాల చేతనే సాయిబాబా దాదాసాహెబ్‌ను మూడున్నర నెలల వరకు (1911-12) తన దగ్గరే ఉంచేసారు. అప్పుడు లక్ష్మీబాయి కూడా షిరిడీలోనే ఉంది. సాయిసచ్చరిత్ర ఆధారంగా దాదాసాహెబ్‌కు తిరిగి వెళ్లేందుకు అనుమతి దొరికినప్పటికీ లక్ష్మీబాయి పిల్లలతో అక్కడే ఉందనీ, దాదాసాహెబ్ దాదాపు నాలుగు నెలలుంటే ఆమె ఏడు నెలలున్నదనీ ఉంది. క్రొత్త మార్పును అర్థం చేసుకొని జీర్ణించుకోవడానికి ఆమెకు అంత సమయం పట్టింది. సహజంగానే అప్పుడు విచారంగా ఉండేది. ఈ సందర్భం అర్థమైతేనే 1923-24 లలో తమకు పేదరికం, ఓర్పు అలవరచడానికే సాయిబాబా దీక్షిత్‌తో లక్ష్మీబాయికి రెండు వందలిమ్మనటం వెనుక దాదాసాహెబ్ పునరాలోచన మనకు అర్థం కాదు.

**(సశేషం)**

# సాకోరీ మహర్షి

## 3వ అధ్యాయం

**మూలం : దాసుగణు**

**అనుకరణ : శుకవాణి**

**(గత సంచిక తరువాయి)**

కాశీనాథ్‌కు దాహం ప్రారంభమైంది. నోరు, పెదవులు ఎండిపోతున్నాయి. నాలుక పిడచకట్టుకొనిపోతోంది. పిలవడానికైనా చాతకావటం లేదు. ఒకవేళ పిలిచినా వినడానికి ఆ నిర్మానుష్యమైన అడవిలో ఎవరుంటారు? కనుచూపు మేర దూరంలో ఎక్కడా నీరులేదు. ఒకవేళ ఉన్నా కదిలే శక్తి కాశీనాథ్‌కు లేదు. అతని కీళ్ళు, కండరాలు అన్నీ బిగుసుకుపోయాయి. కానీ దైవవశాత్తు కుడిచెయ్యి ఒక్కటే పనిచేస్తోంది.

అతనిప్పుడు నీళ్ళకోసం తపిస్తూ తపిస్తూ మరణించవలసిందే. తాను అక్కడికి వచ్చింది అసలు చావుకోసం ఎదురుచూడడానికే అన్న విషయం అతనికి గుర్తు వచ్చింది. ఆ విషయమై బాధేమి లేదు. దాహం కోసమే నరకయాతన. ప్రకృతే అతని మీద దయతలచి స్పృహపోగొట్టింది. అతను ఆ దశలో ఉండగానే ఉరుములు, మెరుపులతో జడివాన ప్రారంభమైంది. గుట్టలూ, మిట్టలూ ఏకం చేస్తున్న ఆ వాన నీళ్ళు కాశీనాథున్న గుహలోకి కూడా వచ్చాయి. కొంచెం లోతున్న చోట ఓ మడుగులాగా నిలిచాయి. వెంటనే కాశీనాథు కుడిచేత్తో నీళ్ళు తీసుకుని తాగసాగాడు. మూడు రోజులపాటు ఆ నీళ్ళతోనే అతని ఆకలి, దాహం తీరాయి.

కుడిచేత్తో ఎడమ చేతినీ, అది బాగయ్యాక రెండు చేతులతో మిగిలిన అవయవాలను మర్దన చేసుకొని శరీరాన్ని స్వాధీనంలోకి తెచుకున్నాడు కాశీనాథ్. మూడు రోజుల తర్వాత అతనికో దృశ్యం కనిపించింది. తానొక వాగు దగ్గరకు నీళ్ళు త్రాగడానికి వెడుతోంటే ఒక హిందువు, ఒక ముస్లిము వచ్చి తనకు చెరోవైపుకు నిలబడ్డారు. తన చర్మం మొత్తం లాగిపారేసారు. దివ్యకాంతులతో ప్రకాశించే శరీరాన్ని చూపించారు. దానివైపు చేయి పెట్టి చూపిస్తూ "ఏమిటీ? నువ్వు చావాలనుకుంటున్నావా? ఎలా చావనిస్తాం? నీ వెనుక మేమున్నాం" అన్నారు. దానితో తనకప్పుడే మృత్యువు నిర్దేశింపబడలేదని అర్థం చేసుకున్నాడు కాశీనాథ్. అందుచేత ఆ గుహలో నుండి బయటపడే మార్గాలు అన్వేషించసాగాడు.

అతని శరీరంలోని కండరాలు కదులుతున్నాయిగానీ క్రిందికి దిగి వెళ్ళి మనుషుల్లో పడేందుకు వీలైన స్థితి ఇంకా రాలేదు. కొండ ఎక్కివచ్చినప్పుడు బలమైన శరీరం ఇప్పుడు లేదు. నిజానికి అది ఎముకలు,






తోలు మాత్రమే మిగిలిన దశలో ఉంది. అతనిలోని సత్తా మాయమైంది. అంచేత అతడు చెట్టు కొమ్మల మీదుగా పాకుతూ వెళ్ళి కొమ్మను పట్టుకొని వేళ్ళాడాడు. చివరికి దైవం మీద భారం వేసి చేతులు విడిచిపెట్టాడు. క్రింద కూలబడ్డాడు. అదృష్టవశాత్తు కొండ క్రిందికి దొర్లిపోలేదు. చిన్న చిన్న కదుములు, వాపులు తప్ప ఎటువంటి ప్రమాదం జరగలేదు. అప్పటికి సాయంత్రం 4 గం.లు అయింది. కాశీనాథ్ నడిచే దశలో లేడు. అందుచేత కుంటివాడిలాగా పాకుతూ కంపలు, పొదలు, రాళ్ళు తప్పించుకుంటూ కదలసాగాడు. అలాఅలా రెండు మైళ్ళ దూరంలో గవల్‌వాడి అనేచోట ఉన్న భిల్లుల గుడిసెల దగ్గరకు చేరుకోవడానికి 5 గం.ల సమయం పట్టింది. కొంతమంది భిల్లకాంతలు చీకట్లో అతనివైపు పాకుతూ వస్తున్న ఆ బక్కపల్చటి ఆకారాన్ని చూచి అదేదో దెయ్యం అనుకొని పారిపోబోయారు. కాశీనాథ్ నేను మనిషినే భయపడకండి అని కేక పెట్టాడు. దానితో నమ్మకం కలిగి వాళ్ళు అతన్ని తమ గుడిసెల్లోకి తీసుకెళ్ళారు. మూడు రోజుల పాటు పాలు పోసి బతికించారు. అటుపైన ఒక నెలరోజులపాటు తనకు ఆతిథ్యమిచ్చిన భిల్లులతోపాటు కట్టెలు కొట్టి నాసిక్‌లో అమ్మి వచ్చిన డబ్బును వారికిస్తూ గడిపాడు.

అటుపైన కాశీనాథ్ తిరిగి సతానాకు బయలుదేరి వెళ్ళాడు. అతనక్కడికి చేరినది 1890 జులై 22. ఇంటికి చేరాక లెక్కలు వేసుకుని చూస్తే తాము భోర్‌గఢ్ గుహలో గాఢసమాధిలో చాలా నెలలపాటు ఉన్నానని కాశీనాథ్‌కు అర్థమైంది.

(చతుర్థాధ్యాయం సమాప్తం)

(సశేషం)



భక్త కథా సుధ

# సమర్థ రామదాసస్వామి–1

– ప్రభుజీ

(గత సంచిక తరువాయి)

వివాహపు ఏర్పాట్లు త్వరగా చేసారు. నారాయణుని పెండ్లికొడుకుని చేసి పీటల మీద కూర్చోబెట్టారు. ముహూర్తం సమీపిస్తున్నది. వధూవరుల మధ్య తెర పట్టుకొన్నారు. తెర పట్టుకొన్న బ్రాహ్మణులు "సావధాన సావధాన" అనే మంత్రాలనుచ్చరించటం ప్రారంభించారు. నారాయణుడు ప్రక్కనే ఉన్న బంధువునడిగాడు "ఎందుకు సావధానంగా ఉండాలని". తప్పించుకోటానికీ వీలులేని బంధనాలు పడబోతున్నాయి జాగ్రత్త" అని దాని అర్థం అన్నాడా పెద్దమనిషి. అంతే నారాయణుని మనస్సులో ఒక మెరుపు మెరిసింది. నారాయణుడు మరుక్షణం అక్కడ లేడు. అంతా గగ్గోలు, అంతా వెదికారు. తల్లికిచ్చిన మాట వరకు పాటించి తానెంచుకొన్న త్రోవన తా బోయినాడు నారాయణుడు.

ఆ వధువుకు వివాహము కాలేదని తీర్మానించి అదే ముహూర్తానికి వేరొక వరునితో వివాహం జరిపించాడు గంగాధరుడు.

ఇల్లు వదలిన నారాయణుడు కాలినడకన పంచవటికి, అక్కడి నుండి 'నాసిక్' (నాసికాత్ర్యంబకేశ్వరం) జేరాడు. సంకల్పబలం అటువంటిది.

నాసిక్ సమీపంలోని 'టాకలి' అనే ఊరి వెలుపల గోదావరి తీరంలో ఒక కుటీరం నిర్మించుకొని తపస్సు ప్రారంభించాడా బాలయోగి.

మధ్యాహ్న సమయంలో భిక్షాటన ద్వారా లభించిన రెండు రొట్టెలను మాత్రం ఆహారంగా స్వీకరిస్తూ మిగతా సమయమంతా గోదావరిలో





మెడబంటి నీటిలో నిలబడి తపోసాధన చేయసాగాడు. తపోదీక్ష తీసుకున్న వారి దీక్షను భంగపరచటానికి ప్రయత్నించేవి ఆదిభౌతిక తాపాలైన ఆకలి, దప్పి, నిద్ర శీతోష్ణాలు మొదలైనవి. ఇవి నారాయణుని మీద తమ ప్రభావాన్నేమీ చూపించలేకపోయాయి. ఆ తరువాత కామక్రోధాదుల వంతు వస్తుంది.

తపోసాధన చేస్తూ ఈ అరిషడ్వర్గాలైన కామక్రోధాదుల్ని పారద్రోల టానికి ప్రయత్నించే వారి మీద ఒకానొక స్థితిలో అవి నూరురెట్లు బలం గలవై కసి తీర్చుకొంటాయట. వాటిని గూడ అతడు జయింపగలిగాడు.

తరువాత ఆధిదైవికములైన తాపాలు అతనిని క్రమ్మించి, ఎందరెందరో దేవపురుషులు చిత్రచిత్రమైన రూపాలలో కన్పించి అతని తపస్సు చెడగొట్ట టానికి ప్రయత్నం చేసారు. కాని నారాయణుని మనస్సుని చలింపజేయ లేకపోయారు.

చివరికి సిద్ధశక్తులు తమ పనిని ప్రారంభించినవి. అణిమ, మహిమ మొదలైన అష్టసిద్ధులు రూపాలు ధరించి చేతులు కట్టుకొని అతని ముందర నిలబడినాయి. ఈ శక్తులు వశమైన వాడికి యీ భౌతిక ప్రపంచంలో చేయలేని పనంటూ ఉండదు. కానీ, వీటిని ఉపయోగించు కోవడం, అద్భుతాలు చేయడం ప్రారంభించగానే అతడు తనకు తెలియ కుండానే ఆ శక్తులకు తానే వశమైపోతాడు. క్రమంగా తపస్సు క్షీణించి, జన్మబంధాల్లో పడిపోతాడు. మాయాదేవి సాధకుని మీద ప్రయోగించే చివరి ఆయుధాలివి. అందుచేతే మహాపురుషుల ఆశ్రితులను రక్షించ వలసిన ప్రత్యేక సందర్భాలలో మాత్రమే వీటిని వినియోగిస్తారు. నారాయణుడు కూడా ఆ శక్తులను లక్ష్యపెట్టలేదు. ఈ పన్నెండేళ్లు తపస్సు చేసి పదమూడు కోట్ల జపం పూర్తి చేసాడు. మనోజయం సిద్ధించింది.

తనలో యిక ఏ వికారాలకూ చోటులేని స్థితి గుర్తించిన నారాయణుడు తపస్సు చాలించినాడు. శ్రీరామచంద్రుడు ప్రత్యక్షమై అతని తపోదీక్షకు మెచ్చి ఏ కోరికలూ లేని అతనికి "రామదాసు" అన్న బిరుదమిచ్చాడు.

తనకు కావలసిందింకేమీ లేదు. ఇక చెయ్యవలసిందేమిటి? తనను చేరిన ఎటువంటి భక్తులకైనా తత్త్వజ్ఞానాన్ని కలిగించే శక్తి సంపాదించటం చేత "సమర్థుడు" అనే బిరుదు సంపాదించుకున్నాడు. అమోఘమైన జ్ఞానశక్తి పన్నెండేళ్లు మథించి సంపాదించిన జ్ఞానామృతాన్ని తానొక్కడే ఆస్వాదించటం అతనికి నచ్చలేదు. ఇటువంటి మహనీయుల జన్మ లోకోపకారార్థమే గదా! వారి జీవితమే జీవితం. అల్లకల్లోలంగా ఉన్న దేశపు తీరును గమనించాడు రామదాసు. తనతోపాటు తన దేశం కూడా యీ అమృతం త్రాగడానికి సమర్థం కావాలి. ఇదెట్లా సాధ్యమవుతుంది? దీనికి ధర్మపునరుత్థానమే ప్రథమ కర్తవ్యం. అయితే దీనికంటె ముందు సమాజం యొక్క స్థితిగతుల్ని బాగా అర్థం చేసుకోవాలి. అంచేత దేశాటనం చేయాలనుకొని తన కుటీరంలో ప్రతిష్ఠించిన ఆంజనేయమూర్తికి నిత్యం పూజాదికాలు చేయటం కోసం ఉద్ధవగోస్వామి అనే శిష్యుడిని నియమించాడు.

పాదాలకు పావుకోళ్లు, ఒక చేతిలో జపమాల, వేరొక చేతిలో జోలె. సొరకాయ పాత్ర, తలమీదొక టోపీ, ఒంటిమీద కఫనీ వంటి పొడవైన చొక్కా, రాముడే రక్షగా యీ వేషంతో భిక్షావృత్తితో దేశాటనానికి బయలు దేరాడు రామదాసు. ఇందులో ఒక రహస్యముంది. భిక్షచేతనే మానవునికి గౌరవం కలుగుతుందట. స్వాతంత్ర్యం లభిస్తుందట. ఈశ్వరప్రాప్తి కూడా సిద్ధిస్తుంది. అయితే యీ భిక్షాటనం చేసే వ్యక్తి సోమరితనంలో కడుపు కక్కుర్తి కోసం గాక సమాజసేవే ప్రధానాశయంగా ధార్మిక ప్రచారం చేస్తూ బయలుదేరినప్పుడు మాత్రమే అలా జరుగుతుంది. అంచేతనే మన శాస్త్రాలు బ్రహ్మచర్య, సన్యాసాశ్రమాలలో భిక్షావృత్తినే విధించినాయి. ఈనాటి విద్యా






ర్థులు బ్రహ్మ చర్యాశ్రమాన్నీ, గురుకుల విధానాన్నీ విస్మరించి పూర్వం ఉన్నటువంటి సామాజిక స్పృహను కోల్పోయి, అహంకారపూరితులౌతున్నారు.

సమర్థ రామదాసస్వామి భిక్షావృత్తితో పల్లెలూ, పట్టణాలూ తిరుగుతూ పోతున్నాడు. ఊరిలో ఏ యింటినీ వదిలేవాడు కాడు. ఒక యింటి ఎదు టికి పోయి, "రఘువీర సమర్థ" అని అరిచేవాడు. ఆ ఇంటివాళ్లు భిక్ష తెచ్చేలోపల ఆ ఇంటిలో ఎందరున్నారో, ఏ వయసువాళ్లో గమనించేవాడు. అలా గమనించి యువకులను ధర్మరక్షణకై నడుం కట్టమని ప్రేరేపించే వాడు. ముసలివాళ్లని భగవచ్చింతన చేయమని ప్రోత్సహించేవాడు. రామదాసస్వామి తమ జీవితాంతం యీ పద్ధతినే అనుసరించారు. క్రమంగా వారి శిష్యుల సంఖ్య లక్షలకు మించింది. భిక్షాన్నం తప్ప వారు శిష్యుల నుండి ఎట్టి విలువైన వస్తువులనూ స్వీకరించేవారు కారు. శివాజీ వంటి రాజు కూడా ఎన్నిసార్లు ప్రార్థించినా ఒక్క ఏగానీ కూడా అతనినుండీ సమర్థులు స్వీకరించలేదు. శిష్యుల మేలుకోరకే వారి సేవలు మాత్రం స్వీకరించేవారు. శిష్యుడు ఎంతటివాడైనా న్యాయం తప్పినపుడు కఠినంగా మందలించటం, నిస్సంకోచంగా శిక్ష విధించటం చేసేవారు. ధర్మరక్షణకై అనేకమంది ధర్మపరులైన శిష్యులను తయారుచేయటమే దీక్షగా గైకొన్నారు.

సమర్థులు కాశీనగరానికి వెళ్లినపుడు అచటి పూజారులు వింతైన వీరి వేషాన్ని చూచి గుడి వెడలి పొమ్మన్నారు. వారు బయటకు వచ్చి నిర్లిప్తంగా అదంతా స్వామి దయే అని నిలబడినారు. గర్భగుడిలోని లింగం హఠాత్తుగా మాయమైంది. దానికి కారణం ఆ మహనీయుని తాము అవమానించడమేనని గ్రహించిన ఆ పండితులు రామదాసస్వామి పాదాల మీద పడ్డారు. వెంటనే వారు ఆలయంలో ప్రవేశించినారు. ఆ సమయాన వారితోపాటు అటచేరిన భక్తులందరికీ సదాశివ సాక్షాత్కారమైనది.

(సశేషం)

# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

## 17వ అధ్యాయం

ఒకసారి గజాననులు ఎడ్లబండిలో అకోలా వెళ్లారు. బాపూరావు దగ్గర విడిది చేసారు. అక్కడికి దగ్గర్లోనే ముర్తజాపూరు దగ్గర 'కురుం' అనేచోట మెహతాబ్‌షా అన్న పేరు గల ఒక ముస్లిం యోగి ఉన్నారు. ఆయన స్వామి వచ్చినపుడు తనకు తెలియజేయమని బాపూరావుతో మునుపు చెప్పి ఉన్నాడు. కనుక ఇతనొక వార్తాహరుడిని 'కురుం' పంపాడు. కానీ, మెహతాబ్‌షా అప్పటికే బయలుదేరి వస్తూ దారిలా ఎలా వార్తాహరునికి ఎదురయ్యాడు. మామూలు మనుషుల్లాగా కాక యోగులు ఒకరితోఒకరు అతి త్వరగా సంప్రదించుకోగలరు. మెహతాబ్‌షా మరి ముగ్గురు ముస్లిం సహచరులతో కలిసి మహరాజ్ దగ్గరకు వచ్చాడు. బాపూరావు ఇంట్లోనే దిగారు. మరునాటి ప్రొద్దున మహరాజ్ మెహతాబ్‌షా కూర్చున్న చోటికి వెళ్లి, ఆయన జుట్టుపీకి, గట్టిగా కొట్టారు. ఇదంతా అతన్ని పరిశుద్ధపరచ డానికే పైగా ఆయన నీవు ముస్లిం పుటక పుట్టావుగానీ ద్వేషం నింపుకొని ఉన్నావు. నీపేరు మెహతాబ్ (వెన్నెల). నీ చుట్టూ చీకట్లు ముసురుకోకుండా చూచుకో" అన్నారు. మెహతాబ్ ఆయన దెబ్బలను సంతోషంగానే స్వీకరించాడు. ఆయనిచ్చిన ఉపదేశం కూడా యితనికి నచ్చింది. ఒక అచ్చమైన యోగే మరొక సాధువును అర్థం చేసుకోగలడు. మిగిలిన ముస్లిం అనుచరులకు ఏం చెయ్యాలో తోచలేదు. మెహతాబ్ వాళ్లను కురుం వెళ్లిపొమ్మన్నాడు. షేక్ కదూ తప్ప మిగతా వాళ్లు వెళ్లిపోయారు. కొంతసేపయ్యాక బచ్చూలాల్ గజాననులను తన యింటికి భోజనానికి





పిలిచి, చాలా మహోత్సవంగా ఒక గుర్రపుబండిలో తీసుకువెళ్లాడు. తీరా అతనింటిదాకా వెళ్లాక స్వామి బండి దిగలేదు. ఒక వివేకం ఉన్న భక్తుడికి అర్థమైంది. మెహతాబ్‌షాను పిలవలేదని స్వామికి కోపం వచ్చిందని. వెంటనే మెహతాబ్‌ను కూడా ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆయనను ఒక థియేటర్‌లో దింపి గజాననులను రామమందిరానికి తీసుకువెళ్లారు. కానీ, ఆయన తిరిగి థియేటర్ దగ్గరికే వచ్చారు. అందరూ అక్కడే విందు భోజనం చేసారు. అటుపైన మెహతాబ్‌షా తాను పంజాబ్‌లో ఒకచోటికి వెళ్లాలని చెప్పి, అక్కడికి టిక్కెట్టు తెప్పించమన్నాడు. వెంటనే షేక్ కదూ ఆయన వెళ్లవద్దనీ, కురుంలోని మసీదు నిర్మాణం యింకా పూర్తి కాలేదనీ ప్రార్థించాడు. కానీ మెహతాబ్ "నాకు గజాననుల ఆజ్ఞ అయింది. ఇంకెవ్వరూ నన్ను ఆపలేరు. మసీదు నిర్మాణం మునుపటిలాగానే ప్రశాంతంగా జరిగిపోతుందిలే!" అన్నాడు.

యోగులు అన్ని మతాలను పవిత్రమైనవిగానే భావిస్తారు. మనుషులు మసీదులకూ, గుడులకూ అతుక్కుపోకూడదు. మందిరమైనా, మసీదైనా ఇటుక, ఇసుక, సున్నాలతోనే కడతారు. హిందువులు, ముస్లిములు అందరూ భగవంతుని బిడ్డలే. అలా అంటూ మెహతాబ్ పంజాబుకు బయలుదేరి వెళ్లిపోయాడు. మరెన్నడూ విదర్భకు తిరిగిరానే లేదు. చూడండి-గజాననులు కొట్టిన దెబ్బలకు మెహతాబ్‌షా కోపం తెచ్చుకోనూ లేదు, బాధపడనూ లేదు. మెహతాబ్ లేకుండా గజాననులు భోజనం చెయ్యలేకపోయారు!

బాపూరావు భార్య బాణామతి వలన బాధపడుతోంది. సింధూరపు జల్లులు మీద పడటం, ఇంటు గుర్తులు వేసిన బింబఫలాలు విసురుగా వచ్చి తగలటం, బట్టలకు నిప్ప అంటుకోవటం - యిలా ఎన్నో యిబ్బందులు. బాపూరావు ఎంతోమంది భూతమాంత్రికులకు చూపించాడుగానీ ప్రయోజనం లేకపోయింది. అంచేత అతడు భార్యను గజాననుల దగ్గరికి

తీసుకువెళ్లాడు. "నీ పావన సన్నిధానంలో యిలాటి క్షుద్రశక్తులెలా పనిచేస్తాయి మహరాజ్" అన్నాడతడు విశ్వాసంతో. అతనన్నట్లే అతని భార్య మరెన్నడూ బాణామతితో బాధపడలేదు.

మహరాజ్ ఓసారి నరసింహజీని చూడడానికి అకోలా వెళ్లారు. నరసింహజీ మఠం ప్రక్కన ఒక బావి ఉంది. మహరాజ్ బావిగట్టు మీద కూర్చొని కాళ్లూపసాగారు. ఆయన బావిలో పడిపోతాడేమోనని చుట్టూ ఉన్నవారు భయపడ్డారు. మహరాజ్ నరసింహజీతో "నీవు అదృష్టవంతుడివి. గోదావరి, యమున, భాగీరథీ నదుల తీర్థం నీకు స్నానానికి దొరుకు తోందిక్కడ. నేనెందుకు స్నానం చెయ్యకూడదు? ఆ నదీమ తల్లులు నన్ను జలకమాడించకపోతే నేనిక్కడి నుంచి కదలనివ్వేళ" అన్నారు. ఆయన ఆ మాటలు పూర్తిచేసారో లేదో బావిలోని నీళ్లు పైకి పొంగి వచ్చాయి. ఫౌంటెన్‌లోంచీ చిమ్మినట్లు గజాననుల మీద పడి ఆయనను అభిషేకించ సాగాయి. వారితోపాటు మిగిలిన వారు కూడా స్నానం చేసేసారు. మహరాజ్ గట్టు దిగగానే నీళ్లు యథాస్థానానికి దిగిపోయాయి. అంతవరకు విశ్వసించని వాళ్లంతా సిగ్గుతో తలలు వంచుకొన్నారు. అటుపైన మహరాజ్ షేగావ్ వెళ్లిపోయారు.

**(17వ అధ్యాయం సమాప్తం)**

**(సశేషం)**










# సంస్మరణం



## మా అమ్మతో ...

అమ్మా అనే పదానికి అర్థం మా మాతాజీ. నేను ఈ ఆశ్రమంలో అమ్మ వేలు పట్టుకొని నడిచే వయసు నుండి అమ్మ నా భుజం మీద చేయి వేసి నడిచే వయసుదాకా అమ్మతోనే ఉన్నాను. ప్రతి తల్లి తన కన్నబిడ్డలకు మాత్రమే ప్రేమను పంచగలుగుతుంది. కానీ, మాతాజీగారు పేగు తెంచుకొని కనకపోయినా అంతకంటే ఎక్కువ ప్రేమను పంచారు. ప్రకృతి లోని అందాలను చవి చూపించారు. ఆ ప్రేమ ఎలాంటిదంటే మా జీవితాలకు వెలుగుబాటను చూపించినటువంటిదికానీ గారాబంతో పాడు చేసింది కాదు. ఎవ్వరూ వేలెత్తి చూపలేని విధంగా మమ్మల్ని పెంచారు. ఈ మాత్రం రాసే శక్తి నాకు ఉందంటే అది అమ్మ అక్షరభిక్షే. నేను చిన్నప్పుడు చదువు విషయంలో చాలా విసిగించేదాన్ని. బాగా దెబ్బలు తినేదాన్ని. మొండిగా ఉండేదాన్ని. అయినా ప్రయత్నం ఆపకుండా వంటల్లోనూ, ఆటపాటల్లోనూ, చదువులోనూ, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ మాదంటూ ఓ గుర్తింపు ఉండేలా తీర్చిదిద్దారు. అలా అని మమ్మల్ని కట్టుదిట్టం చెయ్యలేదు.

మమ్మల్ని తల్లిలా లాలించారు. తండ్రిలా ధైర్యం చెప్పారు. స్నేహితురాలిగా మాతో ఆడారు. గురువులా బోధించారు. మా చిన్నప్పుడు నేను మర్చిపోలేనిది - వెన్నెల్లో భోజనాలు చేయడం. గురువుగారు కథ చెబుతూ ఉంటే అమ్మ మాకు గోరుముద్దలు పెట్టేది. ఆ వెన్నెల్లో ఎన్నో కబుర్లు చెప్పుకునేవాళ్లం. ఎత్తైన కొండలు, పచ్చని ప్రకృతి, ప్రశాంత వాతావరణంలో గురువుగారు, అమ్మ తప్ప మాకు వేరే లోకం తెలియదు. ఇవన్నీ తలుచుకుంటే గుండె బరువెక్కుతుంది. మా అమ్మ మాకు ఆశాదీపం. ఆ దీపం ఆగిపోయి మా జీవితాలను చీకటిమయం చేసింది.

తన జ్ఞానాన్ని ఓ ప్రవాహంలా వేలాదిమందికి పంచారు. మాలో జ్ఞానాన్ని వెలికితీసి మమ్మల్ని ప్రయోజకుల్ని చేసారు. మాకు ఇది రాదు, అది వచ్చు అని లేకుండా ముగ్గులు వెయ్యడం, బొమ్మలు గీయడం, శ్లోకాలు, ఉపన్యాసాలు, పాటలు అన్నీ నేర్పించారు. మేము వేసిన ప్రతి అడుగులో ముందుండి నడిచింది, ఎదురుదెబ్బలు తానే తిన్నది. మా సుఖమే వారికి హారము, మా అమ్మ భౌతికంగా మాతో లేకపోయినా ఆవిడ దీవెనలు మాతోనే ఉంటాయి. మమ్మల్ని లాలించి పాలించే వెచ్చని అమ్మఒడి దూర మయ్యిందని బాధపడుతున్నాం.

మంచైనా, చెడైనా తన మనసులో దాచుకొని మమ్మల్ని మంచి మార్గంలో నడిపించడానికి నిరంతరం కృషి చేసారు. ఏ తల్లీ యింత చెయ్యదేమో! నిజంగా మా భాగ్యం కొద్ది మేము ఇక్కడికి వచ్చాము. ఇంత గొప్ప తల్లి ప్రేమను పొందగలగడం మా అదృష్టం. ఆ తల్లిలాగా విశాల హృదయాన్ని భగవంతుడు మాకు ప్రసాదించాలని కోరుకుంటున్నాను. ఎప్పుడూ ఓ మాట చెప్పేవారు **"లోకం చాలా చిన్నది మన మనస్సు చాలా పెద్దది"** అని. అలాంటి విశాల హృదయులం కావాలి మేము.

ఆశ్రమంలో పిల్లలందరికంటే కూడా అమ్మతో నాకు అనుబంధం ఎక్కువ. ఎక్కడికి వెళ్ళినా నేను తనతోనే ఉండాలనుకునేదాన్ని. అమ్మా అలానే అనుకునేది. తనకు సేవ చెయ్యాలని తపించేదాన్ని. కానీ చివర్లో అమ్మ చెప్పింది పెడచెవిన పెట్టాను. అయినా చనిపోయే ముందు కూడా ఫోన్ చేసి నా దగ్గరికి ఎప్పడొస్తావ్ ... బయలుదేరావా, తొందరగా రా అని మాట్లాడారు. ముందురోజు రాత్రే అమ్మ దగ్గరి నుండి ఇంటికి వచ్చాను. తర్వాత రోజు ఆశ్రమంలో పరిస్థితులు బాగాలేని కారణంగా నేను రాలేక పోతున్నానని అన్నయ్య వస్తున్నాడని చెప్పాను. కానీ, ఇలా జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు. ఆ క్షణంలో నాకు ఏమి చెప్పాలనుకొని తపన పడిందో అని తలచుకుంటే మనస్సు అల్లకల్లోలం చేస్తుంది.





సాయంత్రం స్కూలు నుండి ఇంటికి రాగానే గీ.... వచ్చావా అన్న గొంతు కోసం వెతుక్కుంటున్నాను. నిండు చంద్రునిలా కూర్చీలో కూర్చొని ఏరా ఇంకా అన్నం తినలేదా అని ఆప్యాయంగా పలకరించే ఆ స్వరం మూగ పోయింది. ఏమండీ గురువుగారు - అని సంబోధించే ఆ మాట లేదు.

తల్లిలా లాలించే ఆ స్పర్శ తెలియడం లేదు. అమ్మ గదిలో లైట్ వెయ్య బోయి అరె అమ్మ నిద్రపోతుంది ఇంకా లేవలేదు కదా! పిల్లలు అల్లరి చెయ్యకండిరా అని చెప్పాలని... మనసు ఆరాటపడుతున్నది. ఆశ్రమంలో ఏవైపు చూసినా అమ్మ పిలుస్తున్నట్టే అనిపిస్తుంది. ఆ గొంతు వినాలని, ఒక్కసారి చూడాలని నా మనసు ఆరాటపడుతుంది. అయినా ఫర్వాలేదు. మేము ఉన్నాము మీకు అని మా వెన్నంటి నిలుస్తున్న ఆనందం మామయ్య, చంద్రం బాబాయి, అక్కలు, అత్తయ్యలు చాలామందిలో మిమ్మల్ని చూసుకుంటున్నాము.

అమ్మలో 'అ' నాన్నలో 'న్న' కలిస్తే 'అన్న' అంటారు. అన్నయ్య గురువుగారిని, అమ్మని ఇద్దరినీ ఒకేసారి తక్కువ సమయంలో పోగొట్టుకొని, అంతా శూన్యంగా కనిపించే మాకు అమ్మా ... మీ అందరికీ నేను ఉన్నాను రా ... అని కొండంత ధైర్యాన్ని నింపి ఎంతమంది ఎన్నిమాటలు అన్నా అవన్నీ తన మనసులో దాచుకొని మాకు భరోసాను ఇస్తున్నాడు మా అన్నయ్య. అన్న ఎప్పడు మాకు ఇలా చెప్తుంటాడు - మనం అమ్మలాగా ఆశ్రమం కోసమే బ్రతకాలిరా. వేణువులా ఉండాలి. సర్వం ఆశ్రమమే అనేలా పని చెయ్యాలి. ఏ ఆశయం కోసమైతే వాళ్ళు ఆరాట పడ్డారో దాన్ని మీరు నెరవేర్చాలిరా. దానికి మనం కొన్ని కట్టుబాట్లను పెట్టుకోవాలి. మనం రెండు కళ్ళతో చూస్తుంటాం, సమాజం మనని వేయి కళ్ళతో చూస్తుంది. అమ్మ ఎప్పడు సంతోషిస్తుందంటే మీరు బాగా చదువు కొని ఆశ్రమాన్ని ఉన్నత స్థాయిలోకి తీసుకువచ్చి, మీరు ఇచ్చే సందేశాలను లోకమంతా వింటూ ముక్కున వేలేసుకున్నప్పడు ఆ ... వీళ్ళు నా పిల్లలే అని ఆకాశం నుండి ఆనందంతో కన్నీటి చుక్కలను రాలుస్తుంది. నేను

మీ అందరిలో అమ్మను చూసుకుంటున్నాను అని మాకు పదేపదే గుండెధైర్యాన్ని నింపే అన్నయ్య మాకు అండగా ఉండగా ఇంతకంటే మాకు ఏం కావాలి.

అమ్మా ..... మేమందరం మీరు చూపిన మార్గంలోనే తప్పకుండా నడుస్తాం. కానీ, మా అన్నయ్య మనసు చాలా సున్నితమైనది. చిన్న సమస్యను కూడా తట్టుకోలేడు. అలాంటిది యిప్పుడు అందంగా కనిపించే ముళ్లకిరీటాన్ని ఇచ్చారు. మీరూ, గురువుగారు చెప్పిన మార్గంలో నడుస్తూ సాధన చేస్తున్నాడు. కానీ, దేనినైనా తట్టుకొని నిలబడే గుండె నిబ్బరాన్ని, ఆరోగ్యాన్ని, ఆయుష్షుని ప్రసాదించమ్మా. ఆనందం మామయ్య మనసులో బాధ ఉన్నా, మాకు కనబడకుండా మాతో సంతోషంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. మమ్మల్ని అందరినీ ఎప్పుడూ చూస్తూ ఉంటావు కదమ్మా...

ఇట్లు
నీ
గీ .....
**సాయిధామపు సాయిగీత**

# మాతృసంస్థ కబుర్లు

నవంబరు 25వ తేదీన పూజ్య మాతాజీ జన్మదిన వేడుకలు, మరియు ఆశ్రమ బాలబాలికల దినోత్సవాల సంబరాల కోసం నవంబరు 20వ తేదీ నుండి పనులు మొదలయ్యాయి. మాతాజీ మానసపుత్రికయైన శ్రీ సాయీ విద్యాధామం ఉచిత పాఠశాలలో క్రీడోత్సవ పోటీలు, వ్యాసరచన, పద్య పఠనం, దేశభక్తి గీతాలాపన, వక్తృత్వం, రంగవల్లికలు, ఇలా ఎన్నో రంగాలలో పోటీలు నిర్వహించటంలో మా ఉపాధ్యాయ బృందం తలమునకలైనారు.





ఆ రోజు రానే వచ్చింది. అమ్మ గదిలో మాతాజీ చిత్రపటానికి పూల మాల వేసాము. ఒక్కసారిగా గుండెల్లోంచి బాధ తన్నుకు వచ్చింది. ఆ గదిలో మాకు ఎన్ని మంచి విషయాలు చెప్పారో, ఎన్ని జీవిత పాఠాలు బోధించారో రాముడూ ... ఇది తినరా అని ఎన్నిసార్లు పెట్టారో ఇలా ఎన్ని గుర్తొచ్చాయో .. వచ్చిన సాయీభక్తులకు, సాయిధామం అభిమానులకు, సాయిధామం పరిసర గ్రామాల నుండి వచ్చిన అయ్యప్ప లకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

సాయీ విద్యాధామం పాఠశాలలో సాయంత్రం గం.3.00ల నుండి కార్యక్రమాలు మొదలయ్యాయి. చిన్నపిల్లల శ్లోకాలతో, పెద్ద పిల్లలు ఉపన్యాసాలతో, కవితలతో, నృత్య ప్రదర్శనలతో అలరించారు. సాయీ సేవా సమితి ట్రస్ట్ సభ్యులు అయిన డా॥ చంద్రారెడ్డిగారు మాట్లాడుతూ మాతాజీ గారితో తనకు ఉన్న అనుబంధాన్ని, వారి యొక్క పట్టుదలను, గురుదేవుల పట్ల, వారి వాక్య పాలన పట్ల శ్రద్ధను, సాయిధామం పాఠశాల అభివృద్ధికై అమ్మ చేసిన నిర్విరామ కృషిని గద్గద స్వరంతో సభకు తెలియజేసారు. ఆనందం మామయ్య (ఫౌండర్ ట్రస్టీ) మాతాజీలో ఉన్న గుణగణాలు, పిల్లలు పెద్దలందరమూ అలవర్చుకొని ఆశ్రమాన్ని ఇంకా సేవారంగంలో ముందుకు నడిపించాలని అన్నారు. విశాఖపట్టణం నుండి వచ్చిన శ్రీమతి జయక్క (పూర్వ విద్యార్థి-1978 బ్యాచ్) తమ చిన్ననాడు మాతాజీ నేర్పించిన పాఠాలు, జీవిత పాఠాలని తమ ఆలోచనలో, ఆచరణలో అమ్మ నేర్పిన విద్యనేనని అమ్మ పాఠాలు ఎంతో శ్రద్ధగా వినేవారమని మేము ఇలా జీవిస్తుంది, సేవా రంగంలో అభిరుచితో పనిచేస్తున్నామంటే అది అమ్మ చలవేనని చెప్పారు.

చివరగా నేను (రాంబాబు) మాట్లాడుతూ-అమ్మతో ఉన్న అనుబంధం, నన్ను పెంచిన విధానం అమ్మ యొక్క గొప్పతనం, అమ్మ ఆశయాలు,

అమ్మ త్యాగనిరతి, గురుభక్తిని, అమ్మ రచనా విశిష్టతను సభకు వివరించారు. విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం శ్రీ హన్మంతరెడ్డి గారితో, చంద్రారెడ్డిగారితో, జయక్కతో, పద్మక్కతో జరిగింది. 400 మంది పిల్లలకు, పెద్దలకు పులిహోర-లడ్డూ ప్రసాదం జయక్క తరఫున పంచారు. పిల్లలకు బహుమతులు ఆశ్రమ అభిమానులు, అమ్మ శిష్యులైన శ్రీమతి విజయలక్ష్మి-రఘుగార్లు అందించారు.

డిసెంబర్ 13వ తేదీన సాయిధామంలో దత్త జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం గం.5.30లకు నగర సంకీర్తనతో ప్రారంభమయినాయి. అనంతరం సాయినాథుల వారికి, దత్త స్వామికి పంచామృత అభిషేకాలు జరిగినాయి. దత్త స్వామికి ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామం పారాయణలు సామూహికంగా జరిగింది. సాయి దేవాలయంలో సాయినాథ వ్రతం జరిగింది. మధ్యాహ్నం మహాహారతి అనంతరం జ్ఞానధామంలో పూజ్య గురుదేవులకు అష్టోత్తర శతనామ పూజా కార్యక్రమ అనంతరం దత్తచరిత్ర పారాయణ, గురూపదేశం పొందిన గురుశిష్యులు, ఆశ్రమ అభిమానులు సామూహిక మంత్రజపం చేసారు.

## సత్తెనపల్లిలో

శ్రీ కోదండ రామసాయి సన్నిధానం ఆశ్రమంలో నవంబరు 25వ తేదీ పూజ్య మాతాజీ మాతా శుకవాణిగారి 74వ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని నవంబరు 20వ తేదీ ఆశ్రమంలో 6 నుండి 9వ తరగతి పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వం, దేశభక్తి గీతాలు, చిత్రలేఖనం, క్విజ్ మొదలైన అంశాలలో పోటీలు నిర్వహించడం జరిగినది. బాలబాలికలు పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నవంబరు 25వ తేదీ సాయంత్రం గం.6.30లకు మాతాజీగారి జయంతోత్సవం ప్రారంభమైంది. గుంటూరు నుండి ఆశ్రమ చిరపరి





చితులు, సాయీ సేవా సమితి ట్రస్టు సభ్యులు డాక్టర్ శ్రీమతి ఝాన్సీగారు ముఖ్యఅతిథిగా వచ్చారు. మొదటగా వారిచేత జ్యోతిప్రజ్వలనగావించి తరువాత మాతాజీగారి చిత్రపటం ముందు ఏర్పాటు చేసిన 74 సంఖ్య ఆకారంలో దీపాలు ఏర్పాటు చేసి వచ్చిన వారందరిచేత దీపాలు వెలిగింప జేసాము. ఒకప్రక్క శోభాయమానంగా అలంకరించిన పరమపూజ్య గురుదేవుల చిత్రపటము, మరొకప్రక్కన అలంకరించిన మాతాజీగారి చిత్రపటము దీపాల వెలుగులో తేజోవంతంగా కనిపించి, ప్రసన్నవదనంతో వారు మమ్మందరిని ఆశీర్వదిస్తున్న భావన కలిగినది. తరువాత మాతాజీగారు వ్రాసిన భజన పాటలతో కొంతసేపు భజన చేసిన తరువాత సాయిచాలీసా పారాయణ చేసాము. ముఖ్యఅతిథిగా వచ్చిన డా॥ శ్రీమతి ఝాన్సీగారు మాట్లాడుతూ మాతాజీగారు అనారోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా సాయిసేవ చేసిన విధం, ఆశ్రమం కోసం ఆమె పడిన తపన గురించి చెప్పారు. ఈ సందర్భంగా ప్రతినెల మూడవవారంలో శ్రీ కోదండ రామసాయి సన్నిధానం ఆశ్రమంలో ఒక మెడికల్ క్యాంపు నిర్వహించాలనే సంకల్పం కలిగినదని అందుకు గ్రామస్తులు సహకరించవలసినదిగా కోరారు. అనంతరం పూజారి ప్రేమకుమార్‌గారు మాట్లాడుతూ సాయి సేవామార్గంలోకి రావటానికి మాతాజీగారు చెప్పిన చిన్నకథ (రాముల వారు లంకపై దండెత్తటానికి వానర సేవావాహిని అంతటికి సుగ్రీవుడు కబురు పంపించగా కపి నాయకులందరూ వారివారి సేవతో ఆ మహా యజ్ఞంలో పాలుపంచుకోవటానికి వచ్చారు. కానీ, ఒక సుభిక్షంగా ఉన్న పర్వతప్రాంతం వారు వెళదామా, వద్దా అని కాలయాపన చేయటం, యీలోపు రాములవారు లంకపై యుద్ధం చేసి రావణాసురుడిని సంహరించడం, సీతను తీసుకొని అయోధ్యకు వెళ్లడం అన్నీ జరిగిపోయి

నాయి. పాల్గొన్న వారందరూ ధన్యులయ్యారు. ఆ పర్వత ప్రాంతంలో నివసిస్తున్న కపి నాయకులంతా అనామకులయ్యారు. ఆ ప్రాంతం అంతా కూడా ఎడారిగా మారిపోయింది.) విని నా మనస్సులో ఉన్న సందేహాలన్నీ దూరమై సాయి సేవా యజ్ఞంలో నేనూ ఒక సమిధగా మారటానికి నాకు దొరికిన మంచి అవకాశంగా భావించి వెంటనే రావటం, నేనొక అనామకుడిగా మిగలకుండా పరమపూజ్య గురుదేవులు భౌతికంగా ఉన్నప్పుడే రావటం, సత్తెనపల్లి బ్రాంచి నిర్వహణ, ఉత్తమమైన సాయి సేవ చేసే పూజారి పాత్ర తనకు వరంగా లభించడం వెనుక మాతాజీగారి ఆత్మీయతా భావాన్ని గద్గదస్వరంతో చెప్పారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు డా॥ శ్రీమతి ఝాన్సీగారు బహుమతి ప్రదానం చేసారు. సాయి దివ్యప్రసాద వితరణతో యీ కార్యక్రమం ముగిసినది. ఈ కార్యక్రమానికి సహకరించిన అందరికీ సాయి ఆశీస్సులు.

డిసెంబర్ 10వ తేదీన గీతా జయంతి సందర్భంగా ఆనంద సాయి మందిరంలో శ్రీకృష్ణ పరమాత్మకు పూజా కార్యక్రమం వైభవంగా జరిగినది. రాత్రి గం.7.00లకు విష్ణు సహస్ర నామ పారాయణ సామూహికంగా జరిగింది. శోభాయమానంగా అలంకృతులైన శ్రీకృష్ణుల వారిని భక్తులు దర్శించి, భజించి తరించారు.

12వ తేదీన సాయంకాలం గం.6.30లకు సాయినాథ వ్రతం జరిగింది. 13వ తేదీ ఉదయం గం.6.30లకు ఆనందసాయి ప్రభుల వారికి పంచామృత క్షీరాభిషేకాలు జరిగినాయి. అనంతరం అష్టోత్తర శతనామ పూజ జరిగింది. రాత్రి గం.7.00 దత్త జయంతి సందర్భంగా సాయి దేవాలయంలో ప్రతిష్ఠితులైన దత్తాత్రేయుల వారికి పూజ, దత్త పారాయణ, భజన జరిగినాయి. దత్తాత్రేయుల వారి ప్రత్యేక అలంకరణను దర్శించి తరించారు. అనంతరం ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.







## ఆశీర్వదించండి



**శ్రీమతి మాలతీలత, శ్రీ వీరమాచనేని వెంకట కృష్ణారావుగారలు** ఆశ్రమానికి ఎంతో సన్నిహితులు, బహుకాలంగా సాయివాణిని సర్వాంగ సుందరంగా ప్రచురిస్తున్న సహృదయులు వారు తమ పుత్రుడు **చి॥ సాయితేజ** కళ్యాణోత్సవాన్ని విజయవాడ వాస్తవ్యులు శ్రీ మేదరమెట్ల శ్రీనివాసరావు-శ్రీమతి సాయికరుణగార్ల కుమార్తె **శ్రావ్య**తో సశాస్త్రీయంగా అంగరంగ వైభవంగా దుర్ముఖి నామ సం॥ కార్తీక బహుళ దశమి అనగా 23-11-2016వ తేదీ రాత్రి గం.12.31 ని.లకు (తెల్లవారితే గురువారం) నిర్వహించారు. ఈ నవదంపతులు పరస్పరానురాగంతో కలకాలం జీవించి, తమ సంతతిని లోకకళ్యాణ కారకులుగా, మాతృభూమిని సేవించే ధన్యజీవులుగా తీర్చిదిద్దగలగాలని పరమపూజ్య గురుదేవుల తమ దివ్యాశీస్సులు అందించాలనీ, అమ్మ ప్రేమాశీస్సులు వారికి అందించాలనీ, సాయివాణి మనస్ఫూర్తిగా కోరుకుంటున్నది.

**సాయివాణి పాఠకులందరికీ 2017 ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు. ఈ సంవత్సరకాలం మీకు సమస్త శుభాలనూ యిచ్చి, శ్రీ సాయికి మరికాస్త చేరువ చేసే సాధనను ప్రసాదించాలని సచ్చిదానంద సద్గురు సాయివాణి తన శుభ కామనను అందిస్తోంది. అలాగే తాను ఇరవై ఏడవ ఏట అడుగు పెడుతున్న తరుణంలో ముందరికంటే ఎక్కువ సేవ చేసేందుకై మీ ఆశీస్సులను, అండదండలను కోరుకొంటోంది.**

# ప్రశాంతి

ఇది ఒక యతీశ్వరుడు నడయాడిన చోటు. పాతికేళ్లుగా నిరంతర సత్సంగాలు నడుస్తున్న తావు-శ్రీ సాయినాథుల వారికన్నా ముందరే వారెక్కడ ప్రతిష్ఠింపబడాలో తామే లిఖితపూర్వకంగా చూపిన ఆలయం- పూలతోటలాంటి చక్కని పాఠశాల, ఆనందోత్సాహాలతో తిరిగే శిశుమందిరం వంటివి ఉన్న 33 ఎకరాల వైశాల్యం ఉన్న ప్రదేశం. అలాంటి యీ -

సాయిధామంలోని వానప్రస్థాశ్రమం ప్రశాంతి. ఆధ్యాత్మిక చింతన, కొంతయినా సేవాదృక్పథం ఉన్న - 55 సం॥ పైబడిన 75 సం॥ దాటని వృద్ధులెవ్వరికైనా యిది సాదరంగా స్వాగతం పలుకుతుంది.

## ఆశ్రమం కల్పించేవి

- ❖ చక్కని ప్రశాంత ప్రకృతి సహజ వాతావరణం.
- ❖ సాత్త్వికమైన అల్పాహార, భోజనాలు.
- ❖ నిత్య సత్సంగం.
- ❖ కులభేదాలు లేని సమభావం.
- ❖ సాయిబాబా, దత్త దేవాలయాలు, భారతమాతల నిత్య సందర్శనభాగ్యం.
- ❖ మంచి గ్రంథాలయం.

## ఆశ్రమంలో చేరదలచుకొన్నవారి బాధ్యతలు

- ❖ ఆశ్రమ ప్రశాంతతకు అనుగుణంగా ఉండటం.
- ❖ సేవా కార్యక్రమాలకు చేతనైనంతగా సహకరించడం
- ❖ వారి వసతికీ, భోజనాదికాలకూ చెల్లించవలసిన రుసుమును సక్రమంగా చెల్లించటం.

**ప్రశాంతిలో చేరదలచిన వారు దిగువ ఇచ్చిన ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.**

**పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి**
**దివ్యాశీస్సులతో,**
**ధర్మాధికారి**
**ఫోన్స్ : 9440413455, 9848133565**





# అమ్మ దర్శనం

**– దశ్వంతరావు**

ఏబది వసంతాలకు పైగా వృత్తిరీత్యా విజయవాడలో నివసిస్తున్నాను. గుణదలలో ఒక పెద్ద కొండ. ఆ కొండపై మరియమ్మ తల్లి వేంచేసి యున్నారు. ప్రతి సంవత్సరం భక్తులు డిసెంబరు మాసంలో జరిగే తల్లి ఉత్సవాలకు దూరప్రాంతాల నుండి గూడ తరలివస్తుంటారు. అది క్రైస్తవులకు చాలా పెద్ద పండుగ. ఆ రోజులలో విజయవాడలోను, ఈనాడు గూడ అన్నిదారులు నిండు కొండకే మళ్ళుతాయి. పాదచారులతోను, వాహనాలతోను రోడ్లు క్రిక్కిరిసిపోతాయి.

ఇన్నేళ్ళుగా విజయవాడలో వుంటూ లక్షలాది మంది అమ్మ దర్శనానికి కొండపైకి వెళ్తుంటే, మతాలు కుంపటి ప్రక్కనబెడితే, అమ్మ అమ్మే గదా! నేనొక్కతూరైనా ఎందుకు వెళ్లలేదు? ఇప్పడైనా సంకల్పం బలంగా జేసికొని తల్లిని దర్శించాలనుకున్నా? ఫలితం దక్కింది కానీ ఎక్కడో లోపం జరిగింది.

ఒకరోజు గుంపుగుంపులుగా వున్న అమ్మ భక్తులను తప్పకొని, రకరకాల చిరుతిండ్లు, చెరుకుగడలు, బొమ్మలు, చిత్రవిచిత్రమైన తాకిడులను తట్టుకొని తుదకు కొండను చేరుకున్నాను. మెట్లు ఎక్కగలనా లేదా అనే అనుమాన పిశాచాన్ని అధిగమించి మెట్టుపై కాలెట్టాను. అదొక విచిత్రమైన సన్నివేశం. పైకి వెళ్లాలంటే మెట్ల కిరువైపులా కుప్పలుగా బిచ్చగాళ్ళు బారులుతీరి వున్నారు.

“దానం చేయండి బాబూ! మా ఆకలి తీర్చండి, మీకు పున్నెమొత్తది” అనే ఆర్తనాదాలు కొండ ప్రతిధ్వనించేలా విన్పిస్తున్నాయి. యాత్రికుల ఒడులలో కొద్దిమొత్తంలోనే కావచ్చు మరమరాలు (బొరుగులు) నిండుగా వున్నాయి. కరుణార్ద్ర హృదయులైన యాత్రికులు ఒక్కొక్క భిక్షగానికి గుప్పెడు గుప్పెడు బొరుగులు విదిలిస్తూ వెళ్తున్నారు. ఎంత గొప్పదానం అది... బిచ్చగాని మాటలలోనే విందాం!

దీన వదనము తోడ నొక బిచ్చగాడు
రాలుచున్నట్టి బొరుగుల వరద జూచి
కుక్షిరగిలెడి మంటల తాళలేక జాలిగా
నుడివె నొక మాట భక్తుల గుండెలదర ।

అయ్యలార పిల్లల తల్లులార! శవముపై
జల్లెదరు బొరుగుల జనులు యిలను । ప్రాణ
మున్నట్టి మాపైన విసరవలదు । పట్టెడన్నము
బెట్టి తల్లి కృప కర్రులు జూచుడయ్య ।

ఆ మాటలు నన్నెంతో కలవరపెట్టాయి. బరువెక్కిన హృదయంతో మెట్లెక్క లేక తిరిగి యింటిదారిబట్టాను. కాని బిచ్చగాని ఆవేదన నా మదిలో నేటికిని మెదలుతూనే ఉంది.

స్వామి మాటలు గుర్తుకొచ్చాయి. "మనమేం చేయగలం" కాదు మనమే చేయగలం". ఒక సినీకవి రాసిన పాట గుర్తుకొచ్చింది, "శ్రీమంతులు ధీమంతులు ఇందరున్నారే.. భిక్షగాళ్లు లేకుండ చేయగలేరా!" చేయలేకగాదు చేయాలనే సంకల్పం కరువైనది. ప్రతిమనిషి మనసు కరిగి చేయగల్గినంత చేస్తే ప్రభుత్వం తమ వంతు తాము సాయం ప్రకటిస్తే ఆఫీసర్లు స్వార్థం లేకుండా పంచితే దారిద్ర్యం దూరంగా పోదా? వృద్ధులకు, వికలాంగులకు, రోగగ్రస్తులకు సాయం చేయాల్సిందే... వయసులో వుండి శరీరసౌష్ఠవం బాగుండి సోమరులై చేయి జాపటం నేరంగాదా? ఆలోచించండి. దరిద్ర నారాయణల సేవిస్తే శ్రీమన్నారాయణుని సేవించి నట్లే గదా! హృదయార్ద్రత కావాలి, మనసు కరిగిపోవాలి, భిక్షగాడు లోకానికి మచ్చని గ్రహించి మనందరం నడుం బిగిస్తే దారిద్ర్యం మన దరిదాపులకు కూడ రాదు గదా! అపుడమ్మ హర్షిస్తుంది. తల్లి కరుణకు మనం అర్హుల మవుతాం. తల్లి ప్రేమ అంతగా తెరుగకుండా మనపై వర్షిస్తుంది. "ధన్యోస్మి" గమనించండి. రావటానికి సాహసిస్తుందా?







# మన జెండా

- సాయిగీత సాయిధామప్ప

మహనీయులు అన్నారు వందే మాతరం
దాన్ని నిలపాలి తరతరం
భారతీయుని ప్రతీక పతాకం
భారతీయుని శ్వాస పతాకం
ఎగురుతున్న పతాకానికి వందనం
నెత్తురు ధారపోసి స్వాతంత్ర్యాన్నిచ్చిన త్యాగధనులకు వందనం
పతాకాన్ని గౌరవిద్దాం
మన భవిష్యత్తుని మార్చుకుందాం.
ఓ పతాకమా ..నువు ఎంత ఎత్తుకు ఎగిరితే అంత గౌరవం మాకు
నీవు రెపరెపలాడుతూ ఉంటే ఎంతో ఉత్సాహం మాకు
పతాకంలో ఉంటుంది అశోకచక్రం
ఆ చక్రంలో ఉంది మన భారతత్వం
పతాకం ముందు లేవు హెచ్చుతగ్గులు
అలా ఉండకూడదని జనులకు సంకేతం
ఆకాశంలో ఎగిరే పతాకాన్ని చూస్తుంటే
దానికి కారణం మన ముద్దు బిడ్డలే
అది తలవంచితే మనం బానిసలం
అది ఎగిరితే స్వేచ్ఛా జీవులం
అంటాం వందేమాతరం
అందాం అందరం వందేమాతరం